
## నవ్వితే నవ్వండి!



\- సేకరణ : వాసంతి మాఘుపు.

### చదరంగం!

తండ్రి : రవీ! కిశోర్‌తో నీవు చదరంగం ఎందుకు ఆడుకోకూడదు?

రవి : నాన్నా! ఎవరైనా అబద్ధాలు చెప్తూ, మోసంచేస్తూ, నువ్వు చూడనపుడు పావులను నడుపుతూ ఉంటే - నువ్వు వాళ్ళతో ఆడుతావా?

తండ్రి : లేదు. నేనైతే ఆడను.

రవి : అతను కూడా అంతే!

తండ్రి : ☹

### గుఱ్ఱపు నిర్మాణం!

ఒక పిల్లవాడు ఆడుకోడానికి వెళ్ళి, ఇంటిలోకి వస్తూనే తాను చూసిన విషయములు వాళ్ళ అమ్మతో చెప్పసాగాడు.

పిల్లవాడు : అమ్మా! నీకు తెలుసా? నేను గుఱ్ఱమును తయారుచేస్తున్న అతనిని చూసాను.

తల్లి : బాగుంది. కలపతో చేస్తున్నాడా?

పిల్లవాడు : లేదు. అది నిజమైన గుఱ్ఱమే! అది సకిలిస్తోంది కూడా!

తల్లి : నిజముగా. అంత కచ్చితముగా ఎలా చెబుతున్నావు?

పిల్లవాడు : నేను చూసానమ్మా! అతను పాదాలను తయారుచేస్తూ మేకులను కొడుతున్నాడు.

తల్లి : ఆ(! ☹

### తలనొప్పి!

పిల్లవాడు : అమ్మా! నాకు కడుపు నొప్పిగా ఉందే.

తల్లి : అయ్యో! నువ్వేమీ తినలేదు కదరా! కడుపు ఖాళీగా ఉంది. అందుకే అది నొప్పెడుతోంది.

పిల్లవాడు : అలాగా! అందుకేనా నీకు ఈ మధ్య తలనొప్పి వస్తోంది.

తల్లి : ☹

### మీకీ సామెత తెలుసా?

ఏడ్చేవానికి ఎడమ చేతిప్రక్క, కుట్టేవానికి కుడిచేతిప్రక్క ఉండకూడదు.

ఏడ్చేవాడు మాటిమాటికీ ముక్కు చీది ప్రక్కన రాయడం, కుట్టేవాడు సూదిని అతి వేగంగా కుడివైపు లాగుతుంటాడు. అందువలన ఆ ప్రదేశములు అనుచితములైనవి.

## అరటి పండు - అంధత్వం!

ఇద్దరు పిల్లలు రవి, రాజు మొదటిసారి రైలు ప్రయాణం చేస్తున్నారు. వారు తినడానికి అరటిపళ్ళు తీసుకున్నారు. ఇంతలో రైలు ఒక చీకటి సొరంగంలోనికి ప్రవేశించింది.

రవి : రాజూ! నీవు అరటి పండు తిన్నావా?

రాజు : ఇంకా లేదు. ఎందుకు?

రవి : దానిని తినకు. నేను చిన్న ముక్క కొరికానో లేదో, నాకు చూపు పోయింది.

రాజు : ☹

## పరీక్ష!

ఒక విద్యార్థి పరీక్ష రాయడానికి వచ్చాడు. పరీక్షలో ప్రశ్నలన్నీ తప్పుఒప్పులను గుర్తించడమే! ఆ విద్యార్థి ఒక నాణెమును తీసుకుని, దానిని ఎగురవేస్తూ, బొమ్మ పడితే ఒప్పు, బొరుసు పడితే తప్పుగా గుర్తిస్తున్నాడు. ఈ విధముగా అన్ని ప్రశ్నలకూ సమాధానములు వ్రాయడం జరిగింది. పరీక్షను పూర్తిచేయవలసిన సమయము పూర్తవుతున్నా, ఇంకా నాణెమును ఎగరవేస్తూ, చెమటలు పడుతుండగా, గాబరా పడుతున్న ఆ విద్యార్థిని తనిఖీ అధికారి సమీపించి -

తనిఖీ అధికారి : అబ్బాయీ! కుశలమేనా? నీవు ప్రశ్నలన్నిటికి సమాధానములు వ్రాయడం అయిపోయింది కదా! ఇంకా ఎందుకు గాబరాపడుతూ ఆ నాణెమును అలా ఎగురవేస్తున్నావు?

విద్యార్థి : నేను నా సమాధానములను సరిచూసుకుంటున్నాను. ఏ ఒక్కటీ ముందు వ్రాసిన సమాధానమునకు సరి తూగుటలేదు.

తనిఖీ అధికారి : ☹

## జనభా

ఒక వక్త ప్రసంగిస్తూ "నేడు భారతదేశ జనభాను తగ్గించవలసిన అవసరము ఎంతైనా ఉన్నది. నేడు ప్రతి పది నిముషములకు ఒక స్త్రీ ఒక బిడ్డకు జన్మనిస్తున్నది." వెంటనే ఆవేశపూరితుడైన ఓ వ్యక్తి "అయినచో తక్షణమే ఆమెను వెదికి పట్టుకోవాలి." మిగిలిన అందరూ ముక్కుమీద వేలు వేసుకున్నారు.

## తెలివి తక్కువ వ్యాపారి అంటే!

- చలికాలంలో ఐసుక్రీం అమ్మజూసేవాడు.
- కార్తీక మాసంలో కాశీలో ఉల్లిపాయల దుకాణం తెరచేవాడు.
- పంజాబ్‌లో సెలూన్ ప్రారంభించేవాడు.

*ఈసారికి ఇంతే! మళ్ళీ వచ్చే సంచికలో మరికొన్ని!!*